# చిన్న పార్టీలు.. పెద్ద ప్రభావం

## యూపీలో గెలుపోటములను ప్రభావితం చేయగల సత్తా

### ఓబీసీ, దళిత వర్గాల్లో ఆదరణ

- అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న పార్టీలతో జట్టుకట్టి లబ్ధిపొందిన ఎస్పీ
- ఈసారి అఖిలేశ్‌యాదవ్ పార్టీకి బైబై చెప్పిన ఆర్ఎల్డీ, ఎస్‌బీఎస్పీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: కేంద్రంలో అధికారం చేజిక్కించుకోవాలంటే, 80 లోక్‌సభ స్థానాలు ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మెజార్టీ స్థానాలు గెలుపొందడం అత్యంత కీలకం. గత రెండు ఎన్నికల్లో బీజేపీ గెలుపులో యూపీదే కీలక పాత్ర. 2014 ఎన్నికల్లో కమలం పార్టీ ఇక్కడ 78 సీట్లలో పోటీ చేసి ఏకంగా 71 స్థానాలను గెలవగా , 2019లో 62 స్థానాలను గెలుచుకుంది. ఈ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో సీట్లు దక్కించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. మరోవైపు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా నిలువరించాలని భావిస్తున్న ఇండియా కూటమి.. యూపీలో మెజారిటీ సీట్లను గెలుచుకోవానలే పట్టుదలగా ఉంది. అయితే, పొత్తులను ఖరారు చేసుకోవడంలో, చిన్న పార్టీలను కలుపుకొనిపోవడంలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) – కాంగ్రెస్ కూటమి విఫలమైంది.

**ఓబీసీ, దళితుల్లో చిన్న పార్టీలకు బలం**

ఉత్తరప్రదేశ్ రాజకీయాలను బయటినుంచి చూసే వారికి బీజేపీ, ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ మాత్రమే ప్రధాన పార్టీలుగా కనిపిస్తాయి. కానీ, క్షేత్రస్థాయిలో రాజకీయాలను ప్రభావితం చేసే అనేక చిన్న పార్టీలకు ఉత్తరప్రదేశ్ కేంద్రంగా ఉంది. ఈ పార్టీల్లో ఒక్కో పార్టీకి ఒక్కో సామాజికవర్గంలో, ఒక్కో ప్రాంతంలో బలం ఉంది. ముఖ్యంగా దళిత, ఓబీసీ వర్గాల్లో చిన్న పార్టీలకు పట్టుంది. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీలను కలుపుకుని వెళ్లిన సమాజ్‌వాదీ పార్టీ సీట్ల సంఖ్యను పెంచుకోగలిగింది. ఆ ఎన్నికల్లో పిచ్డే(వెనుకబడిన వర్గాలు), దళిత్, అల్పసంఖ్యాక్(మైనారిటీలు)లను ఏకం చేసి ఆయా వర్గాల బలం ఉన్న చిన్న పార్టీలను కూడగట్టి కూటమి ఏర్పాటుచేసింది. అధికారంలోకి రాకపోయినప్పటికీ సీట్లు, ఓట్ల శాతం పెంచుకోవడంలో ఈ కూటమి విజయవంతమైంది. 2017లో కేవలం 21.82 శాతం ఓట్లతో 47 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న ఎస్పీ.. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్డీ), సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్పీ), జన్‌వాదీ సోషలిస్టు పార్టీ(ఇప్పుడు జన్ జన్‌వాదీ పార్టీ), అప్నాదళ్(కమెరావాదీ), మహాన్‌దళ్ వంటి చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకొని 32 శాతం ఓట్లతో 111 సీట్లకు ఎగబాకింది. ఆర్ఎల్డీ 8, ఎస్‌బీఎస్పీ 6 సీట్లు గెలుచుకున్నాయి. చిన్న పార్టీలను కలుపుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆ ఫలితాలు నిరూపించాయి.

**చిన్న పార్టీలన్నీ ఎస్పీకి దూరం**

ఈ లోక్‌సభ ఎన్నికలకు వచ్చే నాటికి పరిస్థితులు మారిపోయాయి. చిన్న పార్టీలన్నీ సమాజ్‌వాదీకి దూరమయ్యాయి. ప్రధానంగా జయంత్ చౌదరి నేతృత్వంలోని ఆర్ఎల్డీ.. ఎస్పీకి గుడ్‌బై చెప్పి బీజేపీతో జట్టుకట్టింది. పశ్చిమ యూపీలో బలంగా ఉన్న జాట్ సామాజికవర్గంలో ఆర్ఎల్డీకి గట్టి పట్టుంది. ఇక, ఓంప్రకాశ్ రాజ్‌భర్ నేతృత్వంలోని ఎస్‌బీఎస్పీ ఇప్పటికే బీజేపీతో పొత్తులోకి వెళ్లిపోయింది. ఈ పార్టీకి పూర్వాంచల్ ప్రాంతంలో, రాజ్‌భర్ సామాజికవర్గంలో మంచి పట్టుంది. ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి సహా బలియా, ఘాజీపూర్, అజాంగఢ్ వంటి 12 లోక్‌సభ స్థానాల్లో రాజ్‌భర్లు గెలుపోటములను ప్రభావితం చేయగలరు. ఎస్పీతో సీట్ల సర్దుబాటు కుదరక సంజయ్ చౌహాన్ నేతృత్వంలోని జన్ జన్‌వాదీ పార్టీ 30 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నది. ఈ పార్టీకి చౌహాన్ సామాజికవర్గంలో బలం ఉంది. అప్నాదళ్(కే) ఎంఐఎంతో పొత్తు కుదుర్చుకున్నది. ఇక, కేశవ్‌దేవ్ మౌర్య నేతృత్వంలోని మహాన్‌దళ్‌కు ఓబీసీలోని యాదవేతర వర్గాల్లో పట్టుంది. అయితే, సీట్ల సర్దుబాటు కుదరనందున ఈ పార్టీ కూడా ఎస్పీతో పొత్తుకు దూరమైంది. కాకపోతే ఎస్పీ పోటీ చేస్తున్న సీట్లలో మాత్రం బయటి నుంచి మద్దతు ఇస్తామని, ఇదే సమయంలో కాంగ్రెస్ పోటీ చేస్తున్న సీట్లలో మాత్రం బీఎస్పీకి మద్దతు ఇస్తామని ఆ పార్టీ ప్రకటించింది. భీం ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ(ఏఎస్పీ – కాన్షీరాం)తోనూ ఎస్పీకి పొత్తు కుదరలేదు. దీంతో ఈ పార్టీ ఒంటరి పోరుకు దిగుతున్నది.

**బీజేపీకి బలంగా ఆర్ఎల్డీ, ఎస్‌బీఎస్పీ**

ఇలా చిన్న పార్టీలన్నింటినీ దూరం చేసుకొని కేవలం కాంగ్రెస్ పార్టీతో మాత్రమే పొత్తు కుదుర్చుకున్నది సమాజ్‌వాదీ పార్టీ. దూరమైన పార్టీల్లో ప్రధానమైన ఆర్ఎల్డీ, ఎస్‌బీఎస్పీ బీజేపీతో జట్టుకట్టడం ఎన్డీఏకు కలిసి వచ్చే అవకాశాలు ఉన్నాయి. మత్స్యకార వర్గాల్లో పట్టున్న నిషాద్ పార్టీ, కుర్మీ సామాజికవర్గం మద్దతు ఎక్కువగా ఉన్న అప్నాదళ్(ఎస్) కూడా బీజేపీతో కలిసి పోటీ చేస్తున్నాయి. ఇదే సమయంలో మిగతా చిన్న పార్టీలను కలుపుకొనిపోవడంలో విఫలమైన ఎస్పీ – కాంగ్రెస్ కూటమికి ఆయా పార్టీలకు మద్దతుగా ఉన్న సామాజికవర్గాల ఓట్లలో కోత పడవచ్చు. చిన్న పార్టీలను వదులుకోవడం ద్వారా సమాజ్‌వాదీ పార్టీ మరోసారి బీజేపీకి అవకాశం ఇస్తున్నదని జన్ జన్‌వాదీ పార్టీ అధ్యక్షుడు సంజయ్ చౌహాన్ అంటున్నారు. చిన్న పార్టీలు 3 నుంచి 5 స్థానాలు డిమాండ్ చేస్తున్నాయని, అన్ని సీట్లు ఇవ్వలేకపోయామని ఎస్పీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి తెలిపారు.

### లోక్‌సభ బరిలో పిన్న వయస్కురాలిగా శాంభవి

**బీహార్‌లోని సమస్తీపుర్ నుంచి..**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో అత్యంత పిన్న వయస్కురాలిగా బీహార్‌కు చెందిన శాంభవి చౌదరి నిలిచారు. 25 ఏండ్ల శాంభవి సమస్తీపుర్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) టికెట్‌పై పోటీచేస్తున్నారు. శాంభవి తండ్రి అశోక్ చౌదరి జేడీయూలో నేతగా ఉన్నారు. శాంభవి లేడీ శ్రీరామ్ కాలేజ్(ఢిల్లీ యూనివర్సిటీ)లో గ్రాడ్యుయేషన్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ నుంచి పీజీ పట్టా పొందారు. ప్రస్తుతం ఆమె బీహార్‌లోని మగధ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. శాంభవి ఇటీవల ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ విద్య, వైద్య సేవలను మెరుగపరచడమే తన లక్ష్యమని తెలిపారు.

### అనంత్‌నాగ్-రాజౌరి బరిలో గులాం నబీ ఆజాద్

శ్రీనగర్: గులాం నబీ ఆజాద్ అనంత్‌నాగ్–రాజౌరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు ఆయన పార్టీ డీపీఏపీ తెలిపింది. ఆజాద్ 2022లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. తర్వాత డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) పేరుతో సొంత పార్టీ స్థాపించారు. పార్టీ అధినేత ఆజాద్ అనంత్‌నాగ్ –రాజౌరి నుంచి పోటీ చేయాలని కోర్ కమిటీ సమావేశం నిర్ణయించిందని డీపీఏపీ నేత తాజ్ మొహియుద్దీన్ మంగళవారం తెలిపారు. 2014లో ఉధంపూర్ నుంచి బీజేపీ చేతిలో ఓడిన తర్వాత ఆజాద్‌కు ఇవే తొలి లోక్‌సభ ఎన్నికలు. 1980, 1984లో మహారాష్ట్రలోని వాషిమ్ నుంచి ఆజాద్ రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1990–2006 వరకు రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. 2006–08 మధ్య జమ్ముకశ్మీర్ సీఎంగా కొనసాగారు. 2009–2021 ఫిబ్రవరి వరకు మళ్లీ పెద్దల సభలోనే కొనసాగారు.

## హేమంత్ X సీతా సొరేన్?

- లోక్‌సభ బరిలో మాజీ సీఎం!
- దుంకా స్థానం నుంచి పోటీ
- జేఎంఎం కంచుకోటను నిలబెట్టు కొనేందుకు వదినపై పోటీ చేసే అవకాశం

రాంచీ, ఏప్రిల్ 2: జేఎంఎంకు కంచుకోటగా ఉన్న, పార్టీ చీఫ్ శిబు సొరేన్ ఎనిమిది సార్లు ఎంపీగా ప్రాతినిథ్యం వహించిన జార్ఖండ్‌లోని దుంకా లోక్‌సభ స్థానాన్ని ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకొనేందుకు ఆ పార్టీ కృతనిశ్చయంతో ఉన్నది. 2004 నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టిన శిబు సొరేన్.. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోవడంతో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమ పార్టీ విజయాన్ని కొనసాగించేందుకు బీజేపీ ఈసారి పక్కా వ్యూహంతో శిబు సొరేన్ పెద్ద కోడలు సీతా సొరేన్‌ను తమ పార్టీలో చేర్చుకొని దుంకా నుంచి బరిలోకి దింపింది. దీంతో తమ పార్టీ కంచుకోటను నిలబెట్టుకొనేందుకు దుంకా నుంచి తన వదినపై మాజీ సీఎం హేమంత్ సొరేన్ పోటీచేస్తారనే ప్రచారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. దీనిపై రాష్ట్ర సీఎం, జేఎంఎం కీలక నేత చంపయీ సొరేన్ స్పందిస్తూ.. దీనిపై పార్టీ త్వరలో నిర్ణయం తీసుకొంటుదన్నారు.

**తోడికోడళ్ల మధ్య పొలిటికల్ హీట్**

మరోవైపు హేమంత్ సొరేన్ అరెస్టు తర్వాత జార్ఖండ్ రాజకీయాల్లో ముఖ్యంగా సొరేన్ కుటుంబంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకొన్నాయి. శిబు సొరేన్ కుమారుడు, దివంగత దుర్గా సొరేన్ భార్య సీతా సొరేన్ గత నెల బీజేపీలో చేరారు. ఆ వెంటనే కమలం పార్టీ సిట్టింగ్ ఎంపీని పక్కన పెట్టి మరీ ఆమెకు దుంకా లోక్‌సభ టికెట్ కేటాయించింది. హేమంత్ అరెస్టు తర్వాత ఆయన భార్య కల్పన జేఎంఎం పార్టీలో క్రియాశీలంగా మారారు. ఇటీవల సీతా సొరేన్ బీజేపీలో చేరిన సమయంలో వీరిద్దరు పరస్పర విమర్శలతో రాష్ట్ర రాజకీయాలను మరింత హీటెక్కించారు. జమా స్థానం నుంచి జేఎంఎం ఎమ్మెల్యేగా ఉన్న సీత బీజేపీలో చేరడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కల్పన సొరేన్.. మోకరిల్లడం అనేది జార్ఖండ్‌కు చెందిన వాళ్ల డీఎన్ఏలో లేదంటూ పోస్టు పెట్టారు. దీనికి సీత సొరేన్ కూడా ఘాటుగా స్పందించారు. తన భర్త పేరుతో మొసలి కన్నీరు కార్చడం ఆపాలని కౌంటర్ ఇచ్చారు. తాను, తన పిల్లలు నిజాలను వెల్లడిస్తే, కొంత మంది రాజకీయ కలలు కల్లలు అవుతాయన్నారు.

## మోదీ మళ్లీ గెలిస్తే.. మటన్, చికెన్‌పైనా నిషేధం

**డీఎంకే నాయకుడి వ్యాఖ్యలు**

చెన్నై: లోకసభ ఎన్నికల తొలిదశ పోలింగ్ దగ్గరపడుతున్న వేళ వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల వ్యాఖ్యలు ఎన్నికల వేడిని పెంచుతున్నాయి. తమిళనాడులో డీఎంకే నాయకుడు ఒకరు ప్రధాని మోదీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ గెలిస్తే.. మటన్, చికెన్‌పైనా నిషేధం విధిస్తాడంటూ విమర్శించారు. ప్రజల ఆహార ఎంపికపైనా ప్రధాని మోదీ ఆంక్షలు విధిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. చెన్నై ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమిళనాడులోని మొత్తం 39 ఎంపీ స్థానాలకు తొలి దశ పోలింగ్‌తో ఎన్నికలు జరగనున్నాయి. 2019 ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి 38 స్థానాలు గెలుచుకుంది.

## మోదీకి ఓటేయకుంటే.. ఉద్యోగాలు వదిలేయండి!

**రాజస్థాన్ బీజేపీ మాజీ ఎంపీ సంతోశ్ అహ్లావత్ బెదిరింపు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీకి ఓటేయనివారు.. ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోవాలని ఆ పార్టీ మాజీ ఎంపీ సంతోశ్ అహ్లావత్ అన్నారు.ఈ మేరకు శనివారం ఝున్‌ఝునూలోని సూరజ్‌ఘర్‌లో జరిగిన బూత్‌లెవల్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'మోదీకి ఓటేయని ప్రభుత్వ ఉద్యోగులు కొలువులను వదిలేయండి. సూరజ్‌ఘర్‌లోని సర్కారీ కార్యాలయాల్లో కూర్చునే అర్హత వారికి లేనేలేదంటూ ఆమె బెదిరింపులకు దిగారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తున్న బీజేపీ వారిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

## గుజరాత్ బీజేపీలో అసమ్మతి సెగలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 2 : ప్రధాని నరేంద్రమోదీ స్వరాష్ట్రం గుజరాత్ బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. ఆమ్రేలి సిట్టింగ్ ఎంపీ నారన్ కచ్చాడియా స్థానంలో మరో నేత భరత్ సుతారియాకు టికెట్‌ను కేటాయించడం అసమ్మతికి దారితీసింది. పార్టీ క్యాడర్ రెండువర్గాలుగా చీలి రాళ్లు, కర్రలతో కొట్టుకొనే స్థాయికి చేరింది. ఈ ఘటనలో పలువురు కార్యకర్తలు గాయాలపాలై దవాఖానలో చేరారు. రాష్ట్రస్థాయి నాయకత్వం జోక్యం చేసుకొన్నప్పటికీ పరిస్థితులు అదుపులోకి రాలేదు. ఒక్క ఆ మ్రేలిలోనే కాదు.. సబర్‌కాంతా, రాజ్‌కోట్, వడోదరా, వల్సాద్, జునాగఢ్ తదితర ఎంపీ స్థానాల్లో కూడా అభ్యర్థులను మార్చాలంటూ బీజేపీకి కార్యకర్తల నుంచి నిరసన సెగ తగులుతున్నది. రాష్ట్రాధ్యక్షుడు సీఆర్ పాటిల్‌కు ఆయా నియోజకవర్గాల కార్యకర్తలు లేఖలు రాయడమే దీనికి నిదర్శనం. కాగా, గడిచిన పదేండ్లలో గుజరాత్‌లో బీజేపీకి కార్యకర్తల నుంచి ఈ స్థాయిలో అసమ్మతి సెగ రావడం చూడలేదంటున్నారు రాజకీయ విశ్లేషకులు

## కంగనకు కంగారేనా?

- అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న బీజేపీ నేతలు
- హిమాచల్ మండీలో రసవత్తర పోరు

సిమ్లా, ఏప్రిల్2: బాలీవుడ్ సినీ నటి కంగనా రనౌత్‌ను హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి బీజేపీ అధిష్టానం ఎన్నికల బరిలో నిలపటం..ఆ రాష్ట్ర బీజేపీలో అసమ్మతిని పెంచింది. పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కులూ రాజకుటుంబానికి చెందినవారు, వారి వారసులు ఆమెకు వ్యతిరేకంగా ఒక్కటయ్యారు. ఆమె ఎలా గెలుస్తుందో చూస్తామంటూ హెచ్చరికలు జారీచేస్తున్నారు. పార్టీ అధిష్టానం చర్యను నిరసిస్తూ బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి రామ్‌లాల్ మర్కండా ఇటీవలే పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని రాష్ట్ర బీజేపీ మాజీ చీఫ్, మూడు సార్లు ఎంపీ, కులూ రాజకుటుంబానికి చెందిన ప్రముఖుడు అయిన మహేశ్వర్ సింగ్ తాజాగా డిమాండ్ చేశారు.

## అరెస్టు చేసి.. ఓటు వేయించండి!

**తల్లిదండ్రులపై పోలీసులకు బాలుడి ఫిర్యాదు**

ముంబై, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఓటు హక్కు వినియోగంపై పాఠశాలలో అధికారులు, ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో మూడో తరగతి చదివే ఆ చిన్నారి స్ఫూర్తి పొందాడు. ఓటు విలువ తెలుసుకొన్న ఆ బాలుడు.. తమ తల్లిదండ్రులు పోలింగ్ రోజున ఊరికి వెళ్తున్న విషయంపై ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని హింగోళి జిల్లా తాక్‌తోడలో చోటుచేసుకొన్నది. 'పోలీస్ అంకుల్, మా తల్లిదండ్రులు పోలింగ్ రోజున ఊరికి వెళ్తున్నారు. పోలింగ్ రోజున వారిని అరెస్ట్ చేసి ఓటు వేయడానికి తీసుకెళ్లండి. కానీ, ఓటేసిన తర్వాత మళ్లీ వదలిపెట్టండి' అంటూ సాయిరామ్ కైలాస్ పోలీసులకు ఒక లేఖ రాశారు. బాలుడి స్ఫూర్తిని మెచ్చుకొన్న పోలీసులు... రిజిస్టర్లో ఈ లేఖను నమోదు చేశారు.

## 54 మంది రాజ్యసభ ఎంపీల పదవీ విరమణ

### జాబితాలో మన్మోహన్‌సింగ్, 9 మంది కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సహా 54 మంది రాజ్యసభ సభ్యులు మంగళవారం పదవీ విరమణ చేశారు. వీరిలో 9 మంది కేంద్రమంత్రులు కూడా ఉన్నారు. పెద్దలసభలో తన 33 ఏండ్ల పార్లమెంటరీ ఇన్నింగ్స్‌ను మన్మోహన్ సింగ్ ముగించారు. ఆర్థిక రంగంలో ఎన్నో సాహసోపేతమైన సంస్కరణలకు నాంది పలికిన మన్మోహన్ సింగ్ 1991 అక్టోబర్‌లో తొలిసారి రాజ్యసభ సభ్యుడయ్యారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన సింగ్ 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా ఉన్నారు. ఏప్రిల్ 3న బుధవారం 91 ఏండ్ల మన్మోహన్ సింగ్ పదవీ కాలం పూర్తి కావస్తుండటంతో ఆ స్థానంలో తొలిసారి రాజస్థాన్ నుంచి సోనియాగాంధీ రాజ్యసభలో అడుగుపెట్టబోతున్నారు.

**ముగిసిన 7గురు కేంద్ర మంత్రుల పదవీకాలం**

ప్రస్తుతం కేంద్రమంత్రులుగా కొనసాగుతున్న ఏడుగురి రాజ్యసభ పదవీ కాలం కూడా మంగళవారంతో ముగిసింది. వీరిలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా, ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణే, సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఉన్నారు. పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పదవీ కాలం బుధవారంతో ముగియనున్నది. ఈ కేంద్ర మంత్రులందరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. వైష్ణవ్, మురుగన్‌లకు రాజ్యసభలో మరోసారి అవకాశం దక్కింది. మంగళవారం ఒక్క రోజే 49 మంది రాజ్యసభ ఎంపీలు పదవీ విరమణ చేయగా.. ఐదుగురు ఎంపీలు బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. రిటైర్ అవుతున్న వారిలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన జయాబచ్చన్ కూడా ఉన్నారు.

## ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీచేయను

**కర్ణాటక సీఎం సిద్ధరామయ్య**

మైసూర్: ఇకపై తాను ఏ ఎన్నికల్లో పోటీచేయబోనని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మంగళవారం పేర్కొన్నారు. మైసూర్‌లో ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వరుణ నుంచి మరోసారి పోటీచేయాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. 'ప్రస్తుతం నా వయసు 77 ఏండ్లు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి 81–82 ఏండ్లు వస్తాయి. అప్పుడు నా ఆరోగ్యం సహకరించదు. ఉత్సాహంగా పనిచేయగలనా? ఇక చాలు' అని అన్నారు.

## చంద్రుడిపై మొక్కలు పెంచనున్న నాసా

*డక్‌వీడ్, క్రెస్, బ్రాసికా మొక్కలతో 'లీఫ్' ప్రయోగం*

*న్యూఢిల్లీ: ఇంటి లివింగ్ రూమ్‌లో కుండీ మొక్క (పాట్ ప్లాంట్)ను పెంచడం, కనీసం కొన్ని నెలల పాటైనా అది సజీవంగా ఉండేలా చూడటం మనకు కష్టమే కావచ్చు. కానీ, ఆర్టెమిస్-3 యాత్ర ద్వారా చంద్రునిపైకి మళ్లీ వ్యోమగాములను పంపనున్న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' మాత్రం ఇంతకంటే చాలా పెద్ద సవాలును స్వీకరించబోతున్నది. చంద్రుని ఉపరితలంపై డక్‌వీడ్, క్రెస్, బ్రాసికా (ఆవ) మొక్కలను పెంచడమే ఆ సవాలు. 2026లో జాబిల్లిపై నాసా నిర్వహించ తలపెట్టిన మూడు ప్రయోగాల్లో 'లీఫ్' (లూనార్ ఎకెట్స్ ఆన్ అగ్రికల్చరల్ ఫ్లోరా) ఒకటి. చంద్రుని ఉపరితలంపై మొక్కలను పెంచేందుకు నాసా ప్రయత్నించడం ఇదే తొలిసారి. అంతరిక్షంలోని పరిస్థితులను మొక్కలు ఎలా తట్టుకోగలుగుతాయో తెలుసుకునేందుకు కొలరాడోలోని స్పేస్ ల్యాబ్ టెక్నాలజీస్ సంస్థ 'లీఫ్' ప్రయోగాన్ని డిజైన్ చేసింది. దీనిలో భాగంగా వ్యోమగాములు థేల్ క్రెస్, డక్‌వీడ్ లేదా రెడ్ అండ్ గ్రీన్ బ్రాసికా (దీన్ని ర్యాప్‌సీడ్ లేదా విస్కాన్సిన్ ఫాస్ట్ ప్లాంట్ అని కూడా పిలుస్తారు) శాంపిళ్లతో కూడిన 'గ్రోత్ చాంబర్స్'ను చంద్రుని ఉపరితలంపై నెలకొల్పుతారు. ఈ క్యాప్సూల్ అధిక రేడియేషన్, సూర్యకాంతి, అంతరిక్ష శూన్యత నుంచి మొక్కలకు రక్షణ కల్పించడంతోపాటు వాటి పెరుగుదలను వ్యోమగాములు పర్యవేక్షించేందుకు వీలుకల్పిస్తాయి. 'లీఫ్' ప్రయోగానికి ఎంపిక చేసిన మూడు రకాల మొక్కలు భవిష్యత్తులో ఇతర గ్రహాలపై మానవ కాలనీలను ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.*

## అన్ని హద్దులూ మీరారు

- పతంజలి కేసులో సుప్రీం ఆగ్రహం
- క్షమాపణలు చెప్పిన రాందేవ్ బాబా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో భాగంగా యోగా గురువు రాందేవ్ బాబా, పతంజలి ఆయుర్వేద సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణ మంగళవారం సుప్రీం కోర్టు ఎదుట హాజరయ్యారు. తమ ఆదేశాలను పాటించకపోవడంపై కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అన్ని హద్దులూ మీరారని, ఇందుకు తాము తీసుకోబోయే చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. దీంతో పాటు గత నెలలో క్షమాపణలు చెబుతూ పతంజలి సంస్థ దాఖలు చేసిన అఫిడవిట్‌పై కూడా సుప్రీం స్పందించింది. వారి క్షమాపణలతో తృప్తి చెందలేమని వ్యాఖ్యానించింది. దీంతో రాందేవ్‌బాబా కోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. కానీ అఫిడవిట్లో రాందేవ్ బాబు, బాలకృష్ణ ఇచ్చిన వివరణపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏప్రిల్ 10న మరోసారి న్యాయస్థానం ముందు వ్యక్తిగతంగా హాజరవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. దీన్ని విచారించిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో పతంజలి సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు ఎన్నో రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ తప్పుడు ప్రకటనలివ్వొద్దని స్పష్టం చేసింది. లేదంటే తీవ్రంగా పరిగణించాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది. భవిష్యత్తులో ఎలాంటి ఉల్లంఘనలు జరగవంటూ అప్పట్లో పతంజలి సంస్థ తరుపు న్యాయవాది కోర్టుకు విన్నవించుకున్నారు. కానీ ఆ హామీని సంస్థ నిలబెట్టుకోలేకపోయింది. దీనిపై కోర్టు సీరియస్ అయ్యింది. మీపై ఎందుకు చర్యలు తీసుకోరాదంటూ రాందేవ్‌బాబా, బాలకృష్ణలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ప్రకటనల విషయంలో కూడా పలు సూచనలు చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఎలాంటి ప్రచారం చేయరాదని తేల్చి చెప్పింది. అయినప్పటికీ పతంజలి సంస్థ స్పందించలేదు. అదే విషయాన్ని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తర్వాతి విచారణకు వారిద్దరూ కోర్టుకు రావాలని ఆదేశించింది. ఇందులో భాగంగా ఇటీవల పతంజలి సంస్థ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. న్యాయ వ్యవస్థ పట్ల గౌరవమున్నదని పేర్కొంటూ క్షమాపణలు తెలియచేసింది.

## ఆగని కొలువుల కోత

### ఈ ఏడాది తొలి మూడు నెలల్లో 50 వేల మంది టెకీల తొలగింపు

- నిరుడు 2.5 లక్షల మందికి ఉద్వాసన
- బైజూస్‌లో తాజాగా 500 మందిపై వేటు!

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో కొలువుల కోత కొనసాగుతున్నది. దిగ్గజ కంపెనీలను మొదలుకొని స్టార్టప్‌ల వరకూ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత ఏడాది ఏకంగా 2.5 లక్షల మందికి ఉద్వాసన పలుకగా, ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే ఏకంగా 50 వేల మందిని ఇంటికి సాగనంపాయి. ల్యాప్‌ట్యాప్ తయారీ సంస్థ డెల్ రెండేండ్ల వ్యవధిలో రెండో